క్లుప్తంగా

రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్‌కు సత్కారం



పెనమలూరు: రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ అరేపల్లి అప్పారావును రాష్ట్ర టూరిజం మంత్రి కందుల దుర్గేష్ సత్కరించారు. ఏపీ ప్రభుత్వం రాజమహేంద్రవరంలో చిత్రకళాఉత్సవంలో భాగంగా అమరావతి చిత్రకళావీధి కార్యక్రమం ఈ నెల 4వ తేదీన నిర్వహించారు. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు వారి చిత్రాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. పెనమలూరుకు చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ అరేపల్లి అప్పారావు రూపొందించిన చిత్రాలను కూడా ప్రదర్శించారు. అప్పారావు మాష్టారు చిత్రీకరించిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చిత్రాన్ని ప్రశంసించి మంత్రి సత్కరించారు. ఏపీ సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ పి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి వైఎస్సార్ సీపీ వితరణ



పెనమలూరు: శ్రీరామనవమి పండుగ సందర్భంగా కానూరులో శ్రీ సీతారామస్వామివారి కల్యాణ మహోత్సవానికి వైఎస్సార్ సీపీ ఆదివారం విరాళం అందజేసింది. పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి కానూరు రామాలయంలో స్వామివారి కల్యాణానికి రూ.10 వేలు విరాళం ఇచ్చారు. పార్టీ నాయకులు ఆలయ కమిటీకి సొమ్ము అందజేశారు.

గణిత అధ్యాపకుడు మృతి


అలపాటి వెంకట రమణ (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ పుర ప్రముఖుడు, ప్రైవేటు కాలేజీ గణిత అధ్యాపకుడు అలపాటి వెంకట రమణ(72) ఆకస్మిక మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బంధువుల ఇంట్లో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిన ఆయన తీవ్ర గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వైద్యులను తీసుకువచ్చినా, అప్పటికే వెంకట రమణ ప్రాణాలు విడిచారు. హనుమాన్‌జంక్షన్ ప్రాంతంలో రమణ మాస్టారుగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన ఇంటర్మీడియెట్ గణిత పాఠ్యాంశాల బోధనలో మేటిగా పేరు తెచ్చుకున్నారు. ఏడు పదుల వయస్సులోనూ ఇప్పటికీ ప్రైవేట్ కాలేజీల్లో అధ్యాపకుడిగా గణితం బోధిస్తున్నారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైభవంగా చందనోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి సందర్భంగా భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం చందనోత్సవం వైభవంగా జరిగింది. సాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై వీధుల్లో ఊరేగించారు. ఆలయ పాలక వర్గం అధ్యక్షుడు బూరె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, కార్యదర్శి చందలూరి రాజశేఖర్, పీవీఎల్ ప్రసాద్, గుడివాడ విజయ్‌కుమార్, యెనిగళ్ల సుబ్బారావు, పీ రజనీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

విజయలక్ష్మిగా కాళీమాత

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు ఆదివారం భక్తులకు విజయలక్ష్మి అమ్మవారుగా దర్శనమిచ్చారు. విశ్వావసు నామ సంవత్సర వసంత నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ అమ్మవార్లకు ఐదు వేల సంపంగి పూలతో పుష్పార్చన నిర్వహించారు. మూర్తి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. ఆధ్యాత్మిక సల హాదారుడు విజయకిరణ్ శర్మ దంపతులు అమ్మవారికి పట్టుచీరను బహూకరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జీ పుల్లయ్య, కమిటీ సభ్యులు మల్లేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమార్తె ఇంటికి తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదు చేయడంతో నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన మహిళ ఇళ్లలో పనులు చేస్తుంది. ఆమె భర్త 18 సంవత్సరాల క్రితం మృతిచెందాడు. ఆమెకు 17 సంవత్సరాల కుమార్తె ఉంది. ఈ నెల 3న కూరగాయాలు తీసుకురావడానికి అని బయటకు వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద విచారించిన యువతి ఆచూకీ తెలియలేదు. ఫోను చేస్తే రింగ్ అవుతుంది కానీ లిఫ్ట్ చేయడం లేదు. యువతి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేదల వైద్యశాలపై.. పంతమెందుకు బాబూ!

- రూ.1.45 కోట్ల నాడు- నేడు నిధులతో పీహెచ్‌సీ భవనం
- ఎన్నికల సమయంలో ముగింపు దశలో ఆగిన పనులు
- పొరుగు పంచన పీహెచ్‌సీ
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


తుదిదశ నిర్మాణంలో నిలిచిపోయిన బాపులపాడు పీహెచ్‌సీ నూతన భవనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం ప్రారంభానికి నోచుకోవటం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి 80 శాతం పనులు పూర్తి చేసింది. అనంతరం మారిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. మిగిలిన పనులు పూర్తి చేసి నూతన భవనం అందుబాటులోకి తీసుకురాక పోవటంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1.45 కోట్లతో ..

మండల కేంద్రంలోని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు సమూలంగా మార్చుతూ పూర్తిస్థాయి సదుపాయాలతో కొత్త భవనం నిర్మించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. పాత పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వైద్యులు, రోగులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలో నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా రూ.1.45 కోట్ల నిధులు బాపులపాడు పీహెచ్‌సీకి మంజూరు చేసింది. దీంతో నిర్మాణ పనులు కూడా చకచకా ప్రారంభమయ్యాయి. సువిశాల ప్రాంగణంలో నూతన భవనంలో ఆరు ఇన్ పేషంట్ గదులు, నర్సింగ్ రూమ్, డెలివరీ రూమ్, ల్యాబ్, ఫార్మసీ, డాక్టర్ల గదులు రెండు, రిసెప్షన్ వంటి సదుపాయాలు కొత్త భవనం ప్లాన్ ప్రకారం నిర్మించారు. కానీ భవన నిర్మాణం తుదిదశలో నిల్చిపోయింది. గత ప్రభుత్వ హయాంలో మంజూరు అయిందనే నెపంతో పూర్తి చేసిన పనులకు కూడా కాంట్రాక్టర్‌కు నిధుల విడుదల నిలిపివేయటం మరింత విమర్శలకు తావిస్తోంది. దీంతో కాంట్రాక్టర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇరుకు గదిలోనే సేవలు..

రోజుకు దాదాపు 100కు పైగా ఇన్ పేషంట్ సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రికి నూతన భవన నిర్మాణ పనులు దాదాపు ఏడాదిగా ఆగిపోయాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన నిర్మాణాన్ని ఆ తర్వాత సంబంధిత అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో పూర్తి చేసిన నిర్మాణ పనులకు సైతం బిల్లులు మంజూరు కాకపోవటంతో కాంట్రాక్టర్ కూడా అర్ధాంతరంగా పనులు ఆపేశారు.

పొరుగు పంచన విధులు..

పాత భవనం కూల్చివేతలో పీహెచ్‌సీ సిబ్బంది తమ విధులను తాత్కాలికంగా ఆయుష్ హోమియో ఆస్పత్రి బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఆ ఇరుకు గదిలోనే పీహెచ్‌సీ నడుస్తోంది. డాక్టర్లు ఇన్ పేషంట్లకు వైద్య పరీక్షలు చేసేందుకు, ఫార్మసీలోని మందులు భద్రపర్చేందుకు, ల్యాబ్‌లో పరీక్షలు చేయటానికి, రోగులు వేచి ఉండేందుకు ఏలాంటి అవకాశం లేకుండా పోయింది. తాత్కాలిక భవనంలోనే పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నెట్టుకొస్తున్నారు.

ప్రజల వినతి ఇదీ..

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసంపూర్తిగా నిల్చిన పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోకపోవటంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి నూతన పీహెచ్‌సీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి సహకరించండి



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి దాతలు ముందుకురావాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్ పిలుపునిచ్చారు. ఆదివారం క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.50 వేలు విరాళం ఇచ్చిన కంభంపాటి సూర్యచంద్రరావు, మరో రూ.50 వేలు విరాళంఇచ్చిన టీఎస్ఆర్‌కే.ప్రసాద్‌ను వాకర్స్ సత్కరించారు. కిషోర్ మాట్లాడుతూ క్రీడా ప్రాంగణాన్ని వాకర్స్, దాతల సహకారంతో వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్ జీమ్ ఏర్పాటు, బెడ్‌టైల్స్, వాలీబాల్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోర్‌వేల్ ఏర్పాటు, టాయిలెట్స్ నిర్మాణం, ట్రాక్ బలోపేతం పనులు చేపట్టినట్లు వివరించారు. అభివృద్ధి చేయడం వల్ల వాకర్స్, క్రీడాకారులు ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం జీఎస్.రవిబాబు, వాకర్స్ అసోసియేషన్‌కు చెందిన తిరివీధి వెంకయ్య, చిమట రామారావు, ఎలీషా దేవసహాయం, చిల్లపల్లి శ్రీనివాసరావు, కేఎస్. జగదీశ్వరరావు, వీసం ప్రసాదరావు, బ్రహ్మారెడి పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

- పెనుమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో శ్రీరామనవమి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో నిర్వహణ


నున్న తూర్పు రామాలయంలో..


ఉయ్యూరులో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న భక్తులు

గన్నవరం: పెనుమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గన్నవరం మండలం దావాజిగూడెంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి తిరుకల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో సుప్రభాతసేవ, ఎదుర్కోలు ఉత్సవం జరిపారు. అనంతరం రక్షాబంధనం, కన్యాదానం, సుముహూర్తంలో మాంగల్యధారణ జరిపించారు. తొమ్మిది మంది దంపతులు పీటల మీద కూర్చుని స్వామివారికి తలంబ్రాలను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన, సాయంత్రం ప్రత్యేక రథంపై స్వామివారికి శోభయాత్ర నిర్వహించారు. స్థానిక మూడుబొమ్మల సెంటర్‌లో పట్టణ వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. స్థానిక జెడ్పీ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్ నేతృత్వంలో శ్రీరామనవమి వేడుకలు జరిపారు. స్థానిక పాత గన్నవరంలోని శ్రీభద్రాద్రి రామాలయం, స్థానిక గౌడపేట, యాదవులపేట, సగర్లపేట, రజక రామాలయాల్లో స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

పెనమలూరు: మండంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా శ్రీ సీతారామస్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. పోరంకి గ్రామంలో కోదండరామస్వామివారి దేవస్థానంలో శ్రీసీతారామస్వామివార్లకు ముత్యాల తలంబ్రాలతో కల్యాణం చేశారు. వేదాంతం రాజగోపాలచక్రవర్తి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 వేల మందికి అన్నసమారాధన చేశారు. సాయంత్రం గ్రామోత్సవం జరిగింది. గ్రామంలో శ్రీనగర్‌కాలనీలో శ్రీకోదండరామాలయంలో స్వామివారి కల్యాణం చేశారు. పెనమలూరు చిన్నగుడి, గౌడరామాలయంలో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించి అన్నసంతర్పణ చేశారు. కానూరు సనత్‌నగర్ రామాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. పెదపులిపాక శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో శ్రీ సీతారామస్వామివార్ల కల్యాణం చేసి భక్తులకు మహా అన్నసమారాధన నిర్వహించారు.

యనమలకుదురులో..

యనమలకుదురు బోసుబొమ్మ సెంటర్‌లో బోసుదళం ఆధ్వర్యంలో శ్రీ సీతారామస్వామివార్ల కల్యాణ మహోత్సవం చేశారు. మాచిన శివకుమార్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలు చేశారు. దాదాపు రెండు వేల మంది భక్తులను అన్నమారాధన చేశారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ నడకుదటి ఆదిశేషవర్మ దంపతులు కల్యాణం చేశారు. డీజీపీ కార్యాలయం పోలీసు అధికారి శ్రీకాంత్, గుమ్మడి వెంకటగురుప్రసాద్, భక్తులు పాల్గొన్నారు. గ్రామంలో గౌడ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా చేశారు. మండల పరిధిలో శ్రీరామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఉయ్యూరు రూరల్: మండలంలోని సాయిపురం, ముదునూరు, కలువపాముల, కాటూరు, కడవకల్లు, పెదవోగిరాల, చిన్న ఓగిరాల, ఆకునూరు, గండిగుంట గ్రామంలో ఉన్న శ్రీరామ మందిరాల్లో నవమి వేడుకలు నిర్వహించారు. బోళ్లపాడు గ్రామంలో శ్రీ కోదండ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. భద్రాచలంలో శ్రీరామ కల్యాణ ముహూర్తానికి వేద పండితులు కల్యాణం జరిపించారు. అనంతరం అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని రామాలయాలు, విష్ణాలయాలు, ఆంజనేయస్వామి దేవస్థానాలు, ప్రధాన కూడళ్లలో నవమి వేడుకలు జరుపుకున్నారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామివార్ల కల్యాణోత్సవాన్ని భక్తితో జరిపించారు. పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లోని ధ్యానయోగసాయి మందిరంలో అష్టోత్తర, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామ నామాన్ని జపిస్తూ కర్పూర హోమం చేయించారు.

ఉయ్యూరు: ఉయ్యూరు గౌడ రామాలయం వద్ద వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ జంపాన పూల, ఆయన సోదరులు ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తరలివచ్చి స్వామివారికి సమర్పించారు. కాపుల రామాలయం వద్ద కూనపురెడ్డి వాసు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. పట్టణం, మండలంలో అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. పానకం, ప్రసాదాలను పంపిణీ చేశారు. పట్టణంలో శ్రీరామనవమి సందర్భంగా శోభాయాత్ర జరిపించారు. పాత స్టేట్ బ్యాంకు రోడ్డులోని గౌడ రామాలయం వద్ద నుంచి భక్తులు పట్టణ పురవీధుల్లో భక్తులు శోభాయాత్ర చేశారు.

గన్నవరం రూరల్: మండలంలో రామాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. సూరంపల్లి, ముస్తాబాద, చిక్కవరం, వీరపనేనిగూడెం, పురుషోత్తపట్నం గ్రామాల్లోని రామాలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన చేశారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సం నిర్వహించారు. అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని నయన మనోహరంగా నిర్వహించారు. దేవదాయ శాఖ తరుపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈవో తారకేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో దాతలు కేతినేని రత్నాకర్‌రావు, శమంతకమణి దంపతులు (విజయవాడ), డాక్టర్ మల్లా హేమంత్ కుమార్, డాక్టర్ కసికర్తి నాగరత్నం దంపతుల సహకారంతో 2000 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు.

మహా అన్నప్రసాద వితరణ..

హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో సీతారామ భక్తబృందం ఆధ్వర్యంలో భారీ అన్న ప్రసాద వితరణ చేశారు. రామాలయం వెనుక ప్రాంగణంలో ప్రత్యేక పందిళ్లలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. 6000 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. జంక్షన్ ప్రధాన రహదారుల్లో వ్యాపారులు పలుచోట్ల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు ఉచితంగా పానకం పంపిణీ చేశారు. పెరికీడు, వీరవల్లిలోని రామాలయం, షిర్డీ సాయిబాబా మందిర ప్రాంగణంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

విజయవాడరూరల్: మండలంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నున్న గ్రామం తూర్పు శ్రీకోదండ రామస్వామి వారి ఆలయంలో సీతారామస్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సంలో పాల్గొని స్వామి వారికి తలంబ్రాలు సమర్పించారు. భీమవరపు లోకేష్‌రెడ్డి దంపతులు, విజయభాస్కరరెడ్డి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ మహోత్సవ కార్యక్రమం జరిపారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు వేదాంతం బాలాజీ ఆధ్వర్యంలో జరిగింది. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. పడమర బజార్లోని శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో సీతారామస్వామి కల్యాణం సంప్రదాయబద్ధంగా జరిగింది. తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. బోడపాడులో శ్రీభద్రాద్రి సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి శాంతి కల్యాణం జరిగింది. కొట్టే శ్రీనివాసరావు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ కార్యక్రమం జరిపారు. అర్చకులు రొంపిచర్ల లోకాభిరామ్ వైఖానస ఆగమ ప్రకారం కల్యాణం నిర్వహించి అన్నదాన చేశారు. గౌడబజార్లోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. చినకంచిలో సీతారాముల కల్యాణం జరిగింది. పసుబర్తి భాస్కరశర్మ, సెంగలవల ఉమామహేశ్వరరావు, విజయ్‌కుమార్ దంపతులు కల్యాణ కార్యక్రమం జరిపారు. విలేజి కండ్రిక శ్రీకోదండ రామాలయంలో, మంగళాపురంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, పి.నైనవరం లోని శ్రీకోదండ రామాలయంలో కనుల పండువగా జరిగింది. సర్పంచి బట్టా సోమయ్య దంపతులు సీతారాముల వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.


హనుమాన్‌జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో..


కానూరు రామాలయంలో స్వామివారి కల్యాణం


గన్నవరంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో కల్యాణం


ఉయ్యూరు గౌడ రామాలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో భక్తులు


ముస్తాబాదలో కల్యాణోత్సవానికి తరలివెళుతూ..


బోళ్లపాడులో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు


ప్రొద్దుటూరు గాయత్రీవిహార్‌లో..


కంకిపాడు విష్ణాలయంలో..


పోరంకిలో స్వామివారి కల్యాణంలో భక్తులు

రోడ్లపైకి చేరుతున్న మురుగునీరు

ఇదేనా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అంటున్న ప్రజలు


మురళీనగర్‌లో రోడ్డు పై నిలిచిన మురుగునీరు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పనితీరు నానాటికి దిగజారి పోతుంది. ప్రజల సమస్యలపై మున్సిపాలిటీ అధికారులు స్పందించటంలేదు. కనీసం జనావాసాల మధ్య రహదారిపై మురుగు నిలిచిపోతున్నా చర్యలు తీసుకోవటం లేదు. వివరాల్లోకి వెళితే.. తాడిగడప మున్సిపాలిటీ కానూరు మురళీనగర్‌లో డ్రెయినేజీ సమస్య ఉంది. ప్రధానంగా సచివాలయం దగ్గరలోని గౌరీశంకర్‌నగర్ శుభాష్ చంద్రబోస్ వీధిలో గత కొద్ది రోజులుగా మురుగు నీరు రహదారిపై చేరుతోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లటంతో నివాసితులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛాంధ్ర పేరుతో నానా హడావుడి చేసే మున్సిపాలిటీ అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించటం లేదు. ఇక్కడ పారిశుద్ధ్యం పూర్తిగా అటకెక్కింది. మురుగునీరు నిలిచి పోవటంతో దోమలు విజృభిస్తున్నాయి. మురుగునీరు నుంచి తమకు విముక్తి కలిగించాలని నివాసితులు అధికారులను కోరుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి వ్యాధులు ప్రభలక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాజానికి జ్ఞానదీపం గురువు



విజయవాడకల్చరల్: అటు సమాజంలోనూ ఇటు వ్యక్తుల్లోనూ జ్ఞానదీపం వెలిగించేవాడు గురువు అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సాయిరాం మహారాజ్ అన్నారు. శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, నాట్యానికి సేవలను అందించిన నాట్య గురువులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. సాయిరాం మహారాజు మాట్లాడుతూ గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సూచించారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ సంప్రదాయ నృత్యాన్ని పరిరక్షించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యావేత్త బాదినేని రాము మాట్లాడుతూ బాల బాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. నాట్యాచార్యులు రోహితం లక్ష్మీవాత్సల్య, నట్టు వేణుగోపాల్, జొన్నాదుల బేబీ వెన్నెల, అవ్వారు శ్రీదేవి, చెన్నా తన్మయి, దామర్ల నాగచందన, పట్టెం మేఘన, దాము చరిష్మాదేవికి యువనాట్య గురు పురస్కారాలు ప్రదానం చేశారు. నాట్యాచార్య మాగలూరి త్రినాథాచారి, సప్పా ధనలక్ష్మి నిర్వహించారు. చిన్నారులు 150 మంది ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.